
# మరణ వాఙ్మూలం

తుమ్మల కృష్ణకుమార్



"చూడండి, డాక్టర్, ప్రాణం పోయిన తర్వాత గూడా ఆయన ముఖంమీద చిరునవ్వు. ఏదో అర్థంగాని వెలుగూను "

"అవును మమతల్ని వడకట్టి పడి కట్టు రాళ్ళతో తూచగలిగాడు ఆయన ఊపిరి సలపకుండా గొంతుమీద కూర్చొని ప్రాణాల్ని తోడేసిన సంఘాన్ని క్షమించ గలిగానన్న చిరునవ్వు అది దౌష్ట్యాన్ని అంతా మన్నించి సమాజాన్ని ప్రేమించి మానవుడిగా మనగలిగానన్న వెలుగు అది మహాత్ముడు "

"ఏమి టంటున్నారు ?"

"నీ కర్థంగాదులే సిస్టర్ చేయవల సింది కానియి శవపరీక్ష అయింతర్వాత ఆయన దేహాన్ని నా స్వాధీనం చేయమను "

"అంటే ?"

"అంతే "

"నర్సు తనపని తను చూసుకు పోతోంది ఆమె కదంతా అలవాటే మృతకళేబరంమీద తెల్లటి దుప్పటి పరిచేసింది ఆయన జీవన్నాటకం అంతటితో ఆఖరు దుప్పటి ముసుగు వెయ్యడం ఆఖరుసారిగా తెరజారిన ట్లుంది ఆ పడిన తెర మరి లేవదు సృష్టి కార్యంలో అక్కడికో చిన్న అధ్యాయం సమాప్తి మిగిలిందల్లా ఆయన అనుభ వాలు, నా కిచ్చిన సందేశం



"ఆపరేషను గదినుండి బయటి కొచ్చాను భళ్ళున తెల్లవారింది నా జీవి తానికికూడా ఓ కొత్త పగలు ఇక అంతా

వెలుగే చీకటి ఎక్కడా ఉండడానికి వీలులేదు నేటినుండి మరో ప్రపంచం, మరొ జీవితం

చేయి అందించి వీపు తట్టి చిరునవ్వు ఇవ్వకపోగా ఇంతవరకూ సమాజం నా మీద చిన్నచూపే చూసిందన్న కసి కరడుగట్టిపోయిన కసి ఒకప్రక్కనుండి మసి చేద్దామా అన్న కడుపు మంట డాక్టరుగా వున్నా సమాజంమీద పగ ప్రతీకార వాంఛ ఓప్రక్క రగులుతూనే వుంది నాలో కాని నేటితో ఆ పీడకల అయిపోయి, ఆగిపోయింది మహాకవి గురజాడ గీతం చెవుల్లో గింగురుమంటున్నది ఇక నా హృదయాన్నంతా ప్రపంచానికి పంచిపెడతాను ఎవరేమనుకున్నా సరే, నా కెంత హాని చేసినాసరే నా నిశ్చయానికి ఎంతో సంతోషంగా వుంది అయినా ఆయిన – ఆసుపత్రిలో జీవిత ప్రయాణంలో ఆఖరు మజిలీలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆ ఆలోచనే ఏదో అంతులేని ఆ వేదన గుండెలమీద రొడ్డు రోలరు కాళ్ళక్రింద భూమి బద్దకంగా ఆవలించినట్లుంది అంతా దారుణమయిన చీకటి బాధ అంతులేని బాధ అయినా వీటన్నిటినీ జయించడానికి ఆయన నా కిచ్చిన సందేశం అంతే, అంతే, వేరే మార్గం వుండడానికి వీలులేదు

అలవాటుపడ్డ కాళ్ళు అప్పటికే ఇంటికి తీసుకొచ్చినయి నన్ను వరండాలో వాలు కుర్చీలో కూలబడ్డాను చిరునవ్వుతోనూ కాఫీకప్పుతోనూ శ్రీమతి ఒక్కసారి ఉలికిపడింది ఏదో ఆనందం ఏమూలో కనిపిస్తూ, దాన్నంతా కప్పిపుచ్చుతూ ఎంతో ఆవేదన – ఈ ద్వైదీభావం చూసి వుంటుంది నా ముఖంలో

"ఏమిటలా చూస్తావు ? రా, కూర్చో, నీకు చాలా చెప్పాలి పాప ఎక్కడ ? బడికి వెళ్ళిందా ?"

ఇంకా పూర్తికాకముందే మా ఆరేళ్ళ కూతురు మా యింటి ఆనందానికి మూలకందం పరుగెత్తుకుంటూ వచ్చి వళ్ళో వాలింది

"బడికి బయల్దేరావా రాణూ ?''

"అమ్మ వద్దంటున్నది నాన్నా " దాని ముఖంలో బాధ కనపడుతూనే వుంది బడి మానడం అంటే మాష్టారు చెప్పే కథలు సహవాసగాళ్ళతో గుజ్జనగూళ్ళు అన్నీ లేవన్నమాట దానికి అన్నమయినా మానుతుంది గాని బడిమానదు మా రాణూ

"అది ఇక బడికి వెళ్ళదు చదువు లేకపోతే ఋంచిపోయిందిలేదు దానిని పోగొట్టుకోలేను నేను ' ఎంతో ఆప్యాయత, ఆత్రుత శ్రీమతి ఒలికించింది నా కంతుపట్టిందిగాదు అసలు సంగతి

"ఏమిటంటున్నావు రాధా నీవు ?''

''అవును, అంతే అదిక బడికి వెళ్ళదు " ఖండితంగా చెప్పింది

' అసలు సంగతేమిటో చెప్పావు గాదు ఇంతకూ ''

మా రాణూ అందుకుంది "పిల్లల్ని ఎత్తుకుపోతున్నారంట నాన్నా బజారులో నన్నుగూడా తీసుకుపోతా రని ''

నా గుండెల్లో చెయ్యివేసి దేవి న ట్లయింది ఇది అబద్ధం నాకు తెలుసు ఉత్తి గాలి వార్త గొంతెత్తి వూరల్లా వినపడేలా అరవా లనిపించింది

''నన్నుగూడా తీసుకుపోతా రా నాన్నా ? పాపం వాళ్ళకి పాపలు లేరా ఆడుకోటానికి బిళ్ళలు కొనిపెట్ట టానికి, మాటలు చెప్పించుకోటానికి మన బాబుని ఇద్దామా ? మరి మన కెలా నాన్నా ?''

''నీవు నోరు మూస్తావా లేదా ? ఫో యింట్లోకి గడప దాటి బయటకి రాకు " కసిరింది శ్రీమతి

''లేదు రాధా ఇది పచ్చి అబద్ధం పనిలేనివాళ్ళు పుట్టించిన పుకారు '' అరిచేశాను "రాత్రి ఒకతన్ని అనుమానించి రాళ్ళతో కొట్టి చంపేశారు కూడాను నీవుగూడా నమ్ముతున్నావా ఈ పుకార్లను? దాన్ని బడికి వెళ్ళనివ్వు రాధా చనిపోయిన అతను ఒక సన్యాసి సాధువు గూడాను పాపం దాన్ని వెళ్ళనివ్వు రాధా" ప్రాధేయపూర్వకంగా అడిగాను

"సన్నాసులేనండీ సాధువులుగా కనపడతారు గాని కాలాంతకులు ఏదో పూజలికి బలి ఇస్తున్నారట పిల్లల్ని దీన్ని మాత్రం బయటికి కదలనివ్వను వాళ్ళకి స్వర్గం అని, మోక్షం అని మన పిల్లల్ని బలి ఇస్తారండీ, రాక్షసులు ?''

"రాధా'" పట్టరాని కోపంతో అరిచాను అదిరిపోయింది నా భార్య ఆయనను తిట్టడం అదీ రాక్షసు డనడం సహించ లేక పోయాను నేను అతి కష్టంమీద సంబాళించుకున్నాను ఆయన తలపుకు రాగానే ఏడుపు పట్టలేకపోయాను అంత వరకూ ఆపుకున్న బాధ కట్టలు తెంచు కున్నది చిన్నపిల్లవాడిలా ఏడ్చాను కొంత సేపటికి సర్దుకున్నాను తల ఎత్తి చూశాను నా భార్య కొయ్యబారి పోయివుంది

"నీ కర్ధంగాదు రాధా చెపుతాను ఇది చెబుదామనే కూర్చోమన్నాను రాగానే నీవు లోపలికి వెళ్ళు రాణూ బాబుతో ఆడుకోమ్మా ''

''ఏమిటండీ ఇదంతా ? '

"చెబుతాను ఇంకెవ్వరితో చెప్పు కోను ? సావధానంగా విను మధ్య లో ఎక్కడా అడ్డురాకు ప్రశ్నలతో ''

"రాత్రి భోంచేసి మామూలుగానే ఆసుపత్రికి వెళ్ళాను కాజువాల్టీలో పని రాత్రిళ్ళు అకస్మాత్తుగా ఏదయినా ప్రమాదం జరిగినా ప్రమాదంగా జబ్బుగావున్న కేసులు అక్కడికే వస్తాయి ముందు సాధారణంగా అలాంటివి జరగడం తక్కువ కనుక వచ్చే రోగుల సంఖ్య

తక్కువగానే వుంటుంది ఆ ట్టే పని వుండదన్న మాట ఎప్పుడయినా ఏదయినా ప్రమాదం జరిగితే మాత్రం కావలసినంత పని


"నేను వెళ్ళేటప్పటికి ఎలాంటి కేసులూ లేవు కుర్చీలో కూర్చున్నాను కిటికీలో నుండి బయట అంతా చీకటి దూరాన మొరిగే కుక్క ఎక్కడో కదిలిపోయే కారు, రిక్షాల మోత, అలా చూస్తూ ఆలో చనలో ఎడిపోయాను ఇక్కడ పని చెయ్యడం అంటే నాకెంతో సరదా ఏదో ఆనందం ఒకవిధంగా గర్వం కూడాను పగలంతా పాటుబడి, వళ్ళుమరచి నిద్ర పోతుంది ప్రపంచం 'మీకేమనా ప్రమాదం వస్తే మేమున్నాం ఫరవా లేదు హాయిగా నిద్రపొండి మామీద భారం వేయండి' అన్నట్లుంటుంది నాకు తమ సంరక్షణలో తమ సంతానంఅంతా ఎంతో హాయిగా నిద్ర పోతున్నారన్న సంతో షంతో ఆకాశంలో విహరిస్తున్న దేవతలు సంతృప్తిగా నవ్వుకొని ఆ వెలుగును నక్షత్రాల రూపంలో వెదజల్లుతున్నారు ఆ కోవకు చెందిన నవ్వే ఒకటి నా పెదాల మీద మెరిసింది కాని అట్టేకాలం నిలబడ లేదు ఎదురుగా ఇద్దరు పోలీసులు నిల్చొ న్నారు వెనక స్ట్రెచరుమీద ఎవరినో తీసుకొస్తున్నారు అంబులెన్సులో నుండి ఏదో మెడికో–లీగల్ కేసన్నమాట ఇక ఈ రాత్రికి సరి

"రోగిని తీసుకువచ్చి ప్రక్క మీద పడుకోబెట్టారు పోలీసు లేదో చెప్పుకు పోతున్నారు కప్పినగుడ్డ తీసిచూశాను నిర్దాక్షిణ్యంగా రోగులను కోసి ఆపరేషను చేసిన నాకే అతన్ని చూచేవరకు గగుర్పాటు కలిగింది వళ్ళంతా జల్లె డలా తూట్లుపడివుంది రక్తంలో మునిచి తేల్చినట్లున్నాడతను గాయం ఎక్కడుందో, ఎక్కడలేదో తెలీడం లేదు అప్పటికే ఉన్న రక్తం కాస్తా అనేక రంధ్రాల్లోనుండి కారిపోయింది ఇంకా వున్నానంటూ ఎక్కడో నాడి కొట్టుకుంటూనే వుందిగాని నేను చెయ్య గలిగింది అంటూ ఏమీలేదని తెలిసి పోయింది పదిమందే చేసిన పనయినా ప్రపంచంలో వైద్య సౌకర్యాలన్నీ అక్కడున్నా అతన్ని రక్షించడం కాని పని అయినా డాక్టరుగా నాకర్తవ్యం నిర్వర్తించడానికి ఆపరేషను గదికి దారితీశాడు బ్లడ్ ట్రాన్స్ఫ్యూజను ఆక్సిజను అన్నీ యిచ్చాను అయినా ఏం ప్రయోజనం అడుగునంతా చిల్లులు పడి కారిపోయే తొట్టిని ఎంతసేపని నింపగలం? కాకున్నా బయట రక్తం కొళాయిలో నీరులా విరివిగా దొరకదు గాయాలని కట్టుకట్టి మూసివేద్దామంటే ఎన్నని! బాడెల్లా వున్నవాటిని పూర్తి చేసేవరకు గంటపైగా పట్టింది నాకు చేతనయింది చేశాను ప్రక్కన కుర్చీ లాక్కొని స్పృహ వస్తుందేమోనని

ఎదురు చూస్తూ కూర్చున్నాను చట్ట ప్రకారం జరగవలసిన క్రతువులో ఇంకా వాఙ్మూలం తీసుకోవాలి

"మరోగంట గడిచింతర్వాత ఓచిన్న మూలుగు అతను కళ్ళుతెరిచాడు చుట్టూ పరకాయించి చూసి చివరకు నావైపు తిరిగాడు సూటిగా కళ్లలోకి చూశాను బాధ, విచారాలకు అతీతమైన చూపుఅది ఏదో అర్థంగాని చూపు ఆవచ్చిన ప్రాణాన్ని నిలబెట్టాలన్న ఆత్రుతలో ఏమేమో చేయబోతున్నాను "ఎందుకు బాబూ శ్రమ" నిశ్చలంగా నవ్వుతూ అన్నాడు నాకంతా అయోమయంగా వుంది మొదటినుండీ ఈ వ్యక్తి వింతగానే కనిపిస్తున్నాడు సన్యాసిలా కనిపిస్తున్నా సంస్కారానికి తక్కువలేదని అతనన్న ఒక్కవాక్యంలో తెలిసిపోయింది చిద్విలాసంగా చిరునవ్వు నవ్వుతున్నా వెనక నేదో ఒక చీకటి గ్రంథం, అణిచివేసిన భూకంపం ఉన్నట్లున్నది ఎవరితను? ఏమిటిదంతా? ఈ బాధనంతా ఎలా దిగమ్రింగ గలుగుతున్నాడు? పైగా ఆ మందహాసంఏమిటి? ఇలా ప్రశ్నలెన్నో తరుముకొచ్చినయి నా మెదడులో

"అవునుబాబూ నాకింకా అట్టేకాలం వ్యవధిలేదు ఎవరూ రక్షించలేరని తెలుసు రక్షించాలన్న కోరికాలేదు నీకంతా వింతగా వుందికదూ! ఎన్నో



'ముక్కు తిమ్మయ్యగారంటే మీరే గదండీ?"
'అరే ఎలా కనుక్కున్నావోయ్?"
'దాందేముందండి, మీ మొహం చూస్తేనే తెలుస్తుంది"

ప్రశ్నలడగా లనుకుంటున్నావు అవునా ఈ వున్న కొద్దికాలంలో క్లుప్తంగా నా జీవిత చరిత్ర చెబుతాను విను ఇంత వరకూ దీన్నంతా దాచివుంచాను నీ ప్రశ్న లన్నిటికీ సమాధానం దొరుకుతుంది మధ్యలో ఎక్కడా అడ్డురాకు వ్యవధిలేదు కథ పూర్తిగాదు" ఆయాసం వచ్చి ఆగాడు దాహం కావాలన్నాడు

"వినుబాబూ సావధానంగా విను, ఎక్కడా అడ్డురావద్దని మరోసారి కోరుకుంటున్నాను

"సంపన్న కుటుంబంలో పుట్టిన ఒకేఒక బిడ్డను నేను అయినా అనుబంధాలంటూ ఏమీలేకుండా పెరిగాను తల్లి సంగతి అసలు తెలియదుగాని తండ్రి మాత్రం నే నెరిగిన తర్వాత నే చనిపోయాడు గడుసు మేనత్త ఒకామె నా ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూస్తూ

వుండేది నాకు వండిపెట్టేదేగాని నాజీవితం మీద ఆమె ప్రభావం ఏమీ లేదు చదువు కుందామని బడిలో చేరాను బి ఏ చదువుతుండగా నాకు అనిపించింది, ఈ చదువుకూ జీవితానికీ ఏ లాం టి సంబంధంలెదని ఆ వెంటనే మానేశాను అలా వంటరిగా పెరిగి వివాహం చేసు కున్నాను అప్పుడే 'నా' అన్నవాళ్లు నాకు దొరికారు, అయిదేళ్ల లోపలే ముగ్గురుపిల్లలు కలిగారు మొదట కొడుకూ తర్వాత కూతురూ, కొడు కూను అనుబంధాలు లేని అనుభవం నాకు బాగాతెలుసు ఆబాధ నన్నెప్పుడూ కాల్చివేస్తూనే వుండేది ఆ బాధే నాబిడ్డల కుండకూడదని వారినెంతగానో ప్రేమిం చాను అంతవరకూ అణిగిపడివున్న సెంటిమెంటూ అంతా అప్పుడే బయట కొచ్చింది నేను ఏదిదొరక్క బాధ పడ్డానో ఆబాధే నాభార్యాపిల్లలకు లేకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నాను అప్పుడు వాళ్లే నాకు సర్వస్వం కను మరుగయితే నా ప్రాణం గిలగిల కొట్టు కొనేది నాకు స్వయంగా చదువుకోవడం అలవాటయి పోయిందని ముందే చెప్పాను భార్య పిల్లలు సంసారం మొదట వ్యసనం అయితే, పుస్తకాలు నాకు రెండో వ్యసనం ఉంటున్నది పల్లె కాని పట్టణం కనుక తరచూ ఇరవై మైళ్లలోనున్న పెద్దపట్టణానికి వెళ్లి అక్కడ గ్రంథాలయంలో పుస్తకాలు అరువు తెచ్చుకోవడం అలవాటు అలా వెళ్లి రెండురోజులకల్లా వచ్చేవాడిని అలా పదిహేడేళ్లు ఇట్టే గడిచిపోయినయి

"ఆ సంవత్సరం వర్షాకాలం పొలాల మీద పని అయిపోయింది పుస్తకాలకు పట్నం వెళ్ళాను అప్పటికే నా పెద్దకొడుకు పట్నంలో చదువు తున్నాడు వాడిని వదిలి వుండలేక పట్నం ప్రయాణాలు ఎక్కువగా చేస్తూ వుండేవాడిని వారానికోసారి వాడిని చూడడానికి వెళ్లే నన్ను వెర్రివాడినని అంతా అనేవాళ్లు నా భార్య అంటుండేది నవ్వుతో—'ఇంతమంది పిల్లల్ని కన్నారు గాని మీలాంటి వాళ్లని చూడలేదండీ' అని ఆ సారి పట్నంలో కొంచెం ఆల స్యం అయింది దానికి ప్రత్యేక కారణా లున్నయి అప్పటికి గ్రామంలో మేముం డేది తాతలనాటి రెండంతస్తుల భవంతి పాతదయిపోయింది అదీగాక సదు పాయాలు తక్కువ అందుకని అమరి కగా కొత్తయిల్లు కట్టించాలనుకున్నాం మా పెద్దబ్బాయి కొత్తయింటిని గురించి ఏమేమో ఊహించుకుంటున్నాడు పట్నంవెళ్లాను గనక మావాడూ నేనూ కలసి ఒక ప్లాను వేయించాం తోటలు దొడ్లు, గదులు కిటికీలు, వరండాలని మావాడి కోర్కెప్రకారం అయ్యేసరికి వారంరోజు లయిపోయింది అప్పటికే ఇంటిదగ్గర ఎలాగున్నారోనన్న ఆరాటం

ఎక్కువ అయిపోంది నాకు. ఇక్కడ కొడుకు దగ్గరున్న సంతోషంలో గూడా అలాంటప్పుడు రెండుశరీరాలుంటే ఎంత బాగుండును అనిపించేదినాకు అంత లోనే ముసురుపట్టి చిలికి చిలికి తుపానులా అయింది అయినా ప్రయాణం అయ్యాను కాని రైళ్లు నడవటం లేదన్నారు మరోనాలుగు రోజులకు గాని తిరిగి రావడం పడలేదు స్టేషను నుండి మావూరుకు నాలుగు ఫర్లాంగులు నడవాలి వర్షాకాలం అసలు బళ్లు నడవవు స్టేషను బయటికివచ్చి చూస్తే దూరాన మా భవంతి కనబడుతూనే వుంటుంది ఆరోజు ఎప్పుడు చూద్దామా నావాళ్లనంతా అన్న ఆత్రుతతో గబగబ బయటకొచ్చాను రైలుదిగి తలఎత్తి చూశాను భవంతి కనపడిందికాదు ఏదో గుండెల్లో గుబగుబ లాడింది వెర్రిగా వూరివైపు పరిగెత్తాను ఇంటిదగ్గర ఏముంది? ఓ పెద్దసమాధి భవంతి అంతా కూలిపోయింది తలదాచుకోవడానికి వచ్చిన పదిమందితోపాటు నా భార్య ఇద్దరుపిల్లలూ అందులో జీవసమాధి అయిపోయారని చెప్పారు నాముందున్న ప్రపంచాన్నంతా ఎవరో మంత్రగాడు ఊదేసినట్లయింది ఆ వాధ నేమని చెప్పను ' ఆత్మహత్య—సహగమనం అనండి. చేసుకుందాం అనుకున్నాను కానినా ఆశాజ్యోతి నా మొదటిబిడ్డ ఇంకా వున్నాడు నాకోసం అతనికై బ్రతికాను

" స్వంతవూరుమీద మమతల్ని జ్ఞాపకాలనీ చంపుకోలేక నా కొడుకును తిరిగి రమ్మన్నాను కలసి గ్రామంలో వుందామన్నాను ససేమిరా తను చదావాలన్నాడు ఎవరికోసం అయితే ఇంకా జీవించదలచు కున్నానో ఆ ఒక్కడిని వదలి దూరంగా బ్రతకలేక నేను పట్టణానికి వెళ్లాను. గ్రామానికి అశ్రుతర్పణంచేసి నాజీవిత సర్వస్వం ఆ ఒక్కబిడ్డగా పెంచాను వాడిని అంటిపెట్టుకొని తిరిగేవాడిని ఎప్పు డేమవుతుందోనన్న భయం కాలేజీకివెళ్లినా వాడివెంట నీడలా వెళ్లేవాడిని కాని వాడు పెద్దవాడయ్యాడు వ్యక్తిత్వం వచ్చింది అలా నేను వెన్నంటి తిరగటం నచ్చిందిగాదు వాడికి ఎన్నోసార్లు వాదించాడు. అసహ్యించుకున్నాడు గూడాను ఆ వయస్సులో ప్రతివాడూ స్వేచ్ఛగా వుండాలని కోరతాడు వివాహం అయ్యేంతవరకు 'నేను ఒక మనిషినయ్యాను స్వతంత్రంగా ఆలోచించుకోగలను. బ్రతకగలను' అన్న భావన ప్రతి యువకుడిలోనూ వుంటుంది నాసాన్నిహిత్యం ఆభావన గొంతునులిమివేసింది నేను వెంటతిరగటం వాడి వ్యక్తిత్వానికి ఏదో అసంపూర్ణత్వం కలిగించి వుండాలి ఆనాడు నా కర్థంగాలేదు ఏ కొంచెం ఆలోచించగలిగినా వాడికి కొంత స్వేచ్ఛ ఇవ్వగలిగేవాడిని కాని హద్దులులేని ప్రేమ మమతలతో వాడిని

వెంటాడాను ప్రేమ గుడ్డిది అంటారు అందుకేననుకుంటా ఒక రోజు చెప్ప కుండా నా బందిఖానాలోనుండి తప్పిం చుకు పోయాడు తన కోసం వె తి కి ప్రయోజనం లేదని, దూరంగా వెళ్తున్నా నని ఉత్తరం వ్రాసి మరీ వెళ్ళిపోయాడు ఈనాటికీ వాడికోసం వె తు కు తూ నే వున్నాను ''

"ఊపిరి తిరగకుండా చెప్పడం చేత విపరీతంగా ఆయాసం వచ్చింది గాలి పీల్చుకోలేక బాధపడుతున్న ఆయనకు ఆక్సిజన్ అందించి నా జీవితం గురించి నేను ఆలోచనలోపడ్డాను మమతల్ని అర్థంచేసుకోలేక, స్వేచ్ఛ కావాలంటూ ఇల్లు వదలి వచ్చిన నా జీవితం ఒక్కసారి కళ్ళముందు కదిలింది ఇంటింటా వారాలు తిని, ట్యూషన్లు చెప్పి, ఒక ప్రొఫెసరు గారి దయకు పాత్రుడనయి ఆయన ఆద రించి చదివిస్తే ఈరోజు డాక్టరుగా ఇంత వాడి నయాను నా తండ్రికి నేను కలిగిం చిన క్షోభ అంతా ఇప్పుడే అర్ధంఅవు తోంది ఆనాటి నా మూర్ఖత్వానికి ఆయ నెంత బాధపడ్డారో ఊ హిం చు కో లే క పోతున్నాను నా నేరానికి ప్రాయశ్చిత్తం ఏమిటి? ఎలా ఈ పాపం శమిస్తుంది? ఈయనతో నేనెలా చెప్పుకోను నా బాధ? నా ఆలోచనలు తెగకుండానే మ ర లా ఆయన మొదలెట్టాడు ఏదో ప్రేలాపనలా చెప్పుకుపోతున్నాడు తనకున్న కాలం అయిపోతోంది అది పూర్తయేలోగా ఈ చరిత్ర పూర్తి చెయ్యాలన్న కాంక్షతో ఊపిరి తియ్యకుండా చెప్తున్నాడు

"రెండేళ్లు, తిరిగిన ఊరు తిరగకుండా దేశమంతా గాలించాను కనిపించిన ప్రతి కుర్రవాడి మొఖంలోకీ చూచేవాడిని నా కొడుకే నని అందరి ముఖాలు కనపడినా నా కొడుకు ముఖం కనపడింది గాదు కొంతకాలానికి నాలో ఏదో మార్పు వచ్చింది చూచిన ప్రతి కు ర్ర వా డి మొఖంలోనూ నా కొడుకు పోలికే కని పించేది నేను పోగొట్టుకొన్నది సమాజం నాలుగు మూలలా కొల్లలుగా దొరికిన ట్లయింది అలా అందరూ నా బిడ్డలు అయిపోయారు నా కొడుకు దొరుకుతా డని ఆశ నశించింది నా ఆస్థిని ఈ పెంపుడు బిడ్డలకు పెడదామని నిశ్చయిం చాను ఒక అనాధ శరణాలయంవారు నా ఆస్తిమీద ఆదాయాన్ని వాడుకొనేట్లు, మరో పదిహేను ఏళ్ళలో నా కొడుకు తిరిగి వస్తే శరణాలయానికి, వాడికి చెరి సగం భాగం అనీ, కాకుంటే అంతా శరణాలయానికే నని వీలు వ్రాశాను నేను కొంత డబ్బు తీసుకొని దేశంమీద పడ్డాను

"ఎంతకాలం తిరిగానో తె లీ దు డబ్బంతా అయిపోయింది పాత జ్ఞాపకా లేమీ లేవు ఎలా తిరుగుతున్నానో, ఏమి తింటున్నానో తెలీకుండా కొంతకాలానికి నేనూ ఒక అనాధ శ ర ణా ల యా ని కి చేరాను అక్కడ ఎన్నాళ్లున్నానో గుర్తు

లేదు అందులోని పిల్లలమధ్య ఎంతో సరదాగా కాలం గడిచిపోయేది ఎంతో ఆనందంగా వుండేది ఒకరోజు ఒక అధికారి వచ్చి నా పెద్దరికం దృష్ట్యా పిల్లల సంరక్షకుడిగా నన్ను నియమిస్తున్నానని చెప్పాడు ఏదో కొద్దిగా జీతంగూడా యిచ్చేవాళ్లు అదీ పిల్లలమీదే ఖర్చుపెట్టేవాడిని అయినా పిల్లలకు కావలసిన సదుపాయాలు అందేవికావు భోజనం బాగుండేదికాదు బట్టలు సరిగా వుండేవికావు కారణం, ఆ శరణాలయం ట్రస్టీలు దాన్ని ఒక వ్యాపార సంస్థ చెయ్యడం స్వలాభాల కోసం పిల్లల్ని మాడ్చేవాళ్లు శరణాలయం పేర ఆ ట్రస్టీలు బాగుపడ్డారే కాని పిల్లలకు ముట్టవలసింది ముట్టలేదు ఈ విషయం తెలిసిన దగ్గర నుండీ ఏదో కడుపుకోతగా వుండేది ఒకరోజు సాయంత్రం ఒక గడుగ్గాయి మజ్జిగ మంచినీళ్ళలా వున్నయ్యంటే వాడికారోజు భోజనం పెట్టొద్దన్నాడు మేనేజరు అది అన్యాయం అని, పిల్లలకి లేకుండా వాళ్ళు అనుభవించడం ఘోరంఅనీ నే నెదురుతిరిగాను అందరం భోజనం మానేస్తాం అన్నాం మరుసటి రోజు ఉదయానికల్లా నన్ను ఉద్యోగంలో నుండి తీసేశారు మరల బజారున పడ్డాను తరువాత తెలిసిం దేమంటే ఆ శరణాలయం నా ఆస్థితోనే నడుపుతున్నారని అప్పటికి నాలో పోట్లాడే ఓపిక నశించింది ఆ మురికికి దూరంగా వుండి



డాక్టరు అమ్మబాబోయ్! నర్స్! చూడు చూడు ఎన్ను విరగకొట్టి నట్టున్నాడు

నర్సు లేదు డాక్టర్, బాగా కదులుతోంది అంతే ఇంకా ఊడలేదు

పోయాను అంతటితో దాని సంగతి మరచిపోయాను

''ఆ తర్వాత మరికొంత కాలానికి మరొక సంఘటన జరిగింది అలా తిరుగుతూ ఏదో పట్టణం చేరుకున్నాను అన్నం దొరికితే తినేవాడిని లేకుంటే దాని ఆలోచనే వుండేదిగాదు ఎవరయినా ధర్మంచేసిన పావలో పరకో వుంటే బిళ్ళలు కొని కనపడ్డ పిల్లలకు యిచ్చేవాడిని అక్కడో వీధిలో ఒక లాయరుండేవాడు అతనికిద్దరుపిల్లలు ఎంతో అందంగా వుండేవాళ్ళు వాళ్ళు నాతో నేస్తం కట్టారు రోజూ వాళ్ళ నొకసారయినా చూచేవాడిని లాయరు, లాయరు పెళ్ళాం ఎప్పుడూ దెబ్బలాడుకుంటూ వుండేవాళ్ళు ఏదో యిష్టంలెని పెళ్ళనుకుంటా ఆ తల్లి పిల్లల్ని సరిగా చూసేది

గాదు ఆమె గయ్యాళితనం భరించలేక తండ్రి పిల్లలమీద చూపేవాడు కోపం

"ఆ రోజు దీపావళి సాయంత్రం అలా వాళ్ళ యింటి వేపు వచ్చాను ఊరంతా సంబరంగా వుంది కాని వాళ్ళింట్లో అమావాశ్యలాగుంది ఆ ఉదయం పోట్లాడుకున్నా రనుకుంటా భార్యాభర్తలు వాకిట్లో కూర్చొని పిల్లలు పక్కింటివాళ్ళు కాలుస్తున్న మతాబాలు చూసి ఆనందిస్తున్నారు వాళ్ళని చూడగానే మరలా నా బిడ్డలు గుర్తుకొచ్చారు నా దగ్గరున్న నాలుగుడబ్బులతో రెండు అగ్గిపెట్టెలు తెచ్చియిచ్చాను వాళ్ళెంతో సంబరపడ్డారు వాళ్ళనిచూచి నా కెంతో సంబరమయింది అంతలోనే ఆ లాయరుతండ్రి బయటకువచ్చి చూచాడు వాళ్ళిద్దర్నీ నాలుగుబాది అడ్డుపడబోయిన నన్ను పోలీసుస్టేషనుకు తీసుకెళ్ళాడు. పిల్లలకి చాకెలెట్లతో మందుపెట్టి, మరపించి మాయచేస్తున్నానన్న నేరాలకు మూడు నెలలు జైలుశిక్ష పడేట్లు చేశాడు ఆయన పెళ్ళాంమీద పగ అలాతీరింది కాని నా బాధ ఏమనిచెప్పను' ప్రేమతో బయట వారి పిల్లల్ని చేరతీయడంగూడా నేరం అయిపోయింది ఈ ప్రపంచంలో ప్రేమకి, మమతలకూ స్థానం లేదనిపించింది ఎందుకు తింటున్నారో, ఎందుకు బ్రతుకుతున్నారో అర్థంగాదు అడివిలో జంతువులు తమ కుటుంబాల నెంతగా సాకుతయ్యో' అసలొకవేళ పరాయివాడు జాలి, ప్రేమచూపగూడదా? ఎక్కడ దొరుకుతుంది సమాధానం దీనికి' ప్రతివాడూ ఎందుకలా ఎదుటివాడిని శత్రువుగా చూస్తాడు? మానవుడిగా ఎందుకర్థం చేసుకోడు? ఎవరు దీనికి సంజాయిషీ చెప్పగలరు? అదేమంటే పోలీసులు, కోర్టులు, జైళ్ళూను అబ్బ దాహం నాలుక పీక్కుపోతోంది"

మంచినీళ్లిచ్చాను స్పష్టంగా తెలుస్తోంది ఇక ఆయనకట్టే వ్యవధానంలేదని శరీరంలోని అణువణువులోనూ చావు బ్రతుకుల ఘోరపోరాటం కనపడుతున్నది వెన్నంటివచ్చే చావును ఆత్మబలంతోనే వెనక్కి తరిమేస్తున్నాడు ఇంతవరకూ బ్రతకగలిగాడంటే అదంతా కేవలం ఆయన ఇచ్చాబలం ప్రభావమే మరోటిగాదు మరోసారి గట్టిగా ఊపిరి పీల్చాడు

"లక్ష్యంలేని ప్రయాణంనాది అసంబద్ధంగా అసంగతంగా జీవిస్తున్నాను ఆశలు, విచారం ఏకోశానాలేవు కోర్కెలుంటేగదా ఇంకా బాధలు? గాలికి కొట్టుకువెళ్ళే ఎండుటాకుకు ఒక మార్గం గమ్యస్థానం అంటూ ఏమిటుంటాయి' ఎక్కడికని ఆ ప్రయాణం? నా పరిస్థితీ అంతే ఈ వేళరాత్రి జరిగింది కూడా ఇదివరకటి నా జీవితానికి భిన్నంగా లేదు ఏమాత్రంతీసిపోదు రాత్రి సినిమా వదలిపెట్టారు ఎక్కడో తిరుగుతూ నే నిప్పటికి అక్కడకు చేరుకున్నాను

శూన్యంలోకిచూస్తూ నడుస్తున్న నా కళ్ల కొక హృదయవిదారకమయిన దృశ్యం కనపడింది ఒక తల్లిచుట్టూ నలుగురు పిల్లలు, చేతుల్లో మరో అడ్డాలపాప ఏవిధమయిన పోషణా శ్రద్ధా కనపడ లేదు పిల్లలమీద ఇష్టంలేని, అవసరం కలగని పిల్ల లనుకుంటాను ఎదురుగా శనగలు అమ్మేవాడిని చూపి కావాలని నోరుతెరచి అడిగారు వాళ్ళు తలా రెండు చేత్తో గట్టిగా వడ్డించి, కసరు కొంది ఆ తల్లి పిల్లల్లో ఒకడు పెంకె వాడు శనగలవాడివైపు పరుగెత్తి చెయ్యి చాపాడు తన పెళ్ళాంబిడ్డల పోషణకై వ్యాపారం చేసుకొనేవాడికి ఆ బిడ్డలమీద కనికరం కలగలేదు సరి గదా వాడూ కసిరికొట్టాడు ఎక్కడో మూల మిగిలిపోయిన మా సవత్వం నాలోంచి బయటకొచ్చింది మరలా నా బిడ్డలు గుర్తుకొచ్చారు దుఃఖం ఆగింది కాదు భగవంతుడంటూ వుంటే ఇంత నిర్దాక్షిణ్యంగా వుంటాడా? బిడ్డలనిలా నిరాధారం చేస్తాడా? కన్నతల్లి కంత మాత్రం ప్రేమలేకుండా ఎలా సృష్టి స్తాడు? ఎవరిని అడగను ఈ ప్రశ్నలు? సమాధానం ఇవ్వవలసిన బాధ్యత ఎవ రిది? ఏదో అదృశ్యశక్తి నన్ను నడి పింది ఆలోచించలేకపోయాను పరు గెత్తికెళ్ళి ఆ బిడ్డ నెత్తుకొని ముద్దెట్టు కున్నాను నన్ను నేను మరిచిపోయాను నా అవతారం చూసి గాభరాపడ్డాడేమో ఆ పిల్లవాడు ఏడ్వడం మొదలెట్టాడు నా కది అర్థంగాలేదు అప్పుడు చుట్టూ మరెవరూ కనపడలేదు నా ఉద్రేకంలోనే కొట్టుకుపోయాను ఏదో జన్మ సార్థక్యం అయినట్లుంది ఇంతలోనే ఆ తల్లి "నా బిడ్డ, నా బిడ్డ" అంటూ కేకవేసింది నావైపు చూపుతూ అంతే చుట్టూరావున్న జనం నాచుట్టూమూగారు వారిలోని పశుత్వం అంతా నా మీద చూపారు మిగతా విషయం మీకు తెలుసు "

అక్కడాగాడు ఆయన మొఖంమీద ఏదో వింత వెలుగు గొప్ప వెలుగు ఆరిపోబోయేముందు ఆఖరిసారిగా ఉవ్వెత్తుగా వెలిగే కాగడా తలపు కొచ్చింది నాకు మరలా చెపుతున్నాడు

''అంతేబాబూ అంతే నే చేసిన తప్పల్లా జాలిపడటం సాటివారిని ప్రేమించడం నాకు చాలాసార్లు అనిపిస్తూ వుండేది ఈ పాడు ప్రపంచాన్ని ఒక వైపునుండి నరికివేద్దామని కాని ఎవరి మీద పగ? వీళ్ళ తెలివితక్కువ తనం చూస్తుంటే నాకెంతో జాలి తప్పు చేసిన తనవాళ్ళని క్షమించి ఆశీర్వదించిన ట్లుంటుంది నాకు వాళ్ళంతా దుష్టులయినా నేను ప్రేమించాను బాబూ ఆ కారణంగానే చావటం నాకెంత సంతోషం! వాళ్ళంతా నా కెన్ని బాధలు పెట్టినా సంఘం అంతా నా కుటుంబంలాగా ప్రేమించగలిగానన్న సంతోషం, గర్వం నాకు మిగిలాయి

బాబూ చాలు, నాకింకేమీ అవసరంలేదు ఆ సంతృప్తితోనే హాయిగా కన్ను మూస్తాను ఎదుటివాడు ఎన్ని బాధలు పెట్టినా అతన్ని ప్రేమించడం గొప్ప అదే మానవత్వానికి పరమావధి ఈ సందేశం చెప్పాలనే నా కొడుకుకోసం ఇంతవరకూ గాలించాను నా దగ్గర మిగిలింది, అతనికి వారసత్వంగా వదలి పెడదామనుకుంది అంతా ఇంతే నాయనా వాడు దొరకలేదు నీకిస్తున్నాను నా ఆస్తి "

ఆయన కథ అయిపోయింది చెప్ప గలిగానన్న సంతోషంతో నావైపు తిరిగి చూచాడు అంతవరకూ నేనొక శ్రోతగానే వున్నా నాయనకు నన్నప్పుడే పరిశీలనగా చూచాడు "అదేమిటి నాయనా, ఏడుస్తు న్నావా ? నామీద నీ కొక్కడికయినా జాలిగలిగిందంటే నా కెంతో సంతోషంగా వుంది జీవితం ఆఖరు క్షణాల్లో నయినా నామీద సానుభూతి, ప్రేమ చూపించగల వ్యక్తి దొరకడం ఎంత అదృష్టం ! ఎంతో ఆనందంగా వుంది బాబూ నా కింక ఎలాంటి కోరికలూ లేవు "

"మీ అబ్బాయి పేరు చెప్పారుగాదు, ఇంతవరకూ ?" ఏడుస్తూనే అడిగాను

"ఏం నాయనా వెతుకుతావా ? నా సందేశం అందిస్తావా ? మంచిది బాబూ, మోహనరావు "

"నాన్నా," అని అరిచాను ఆవేశంతో

"ఆఁ ! ఏమిటన్నావు ?"

"అవును నాన్నా, నేనే మీ మోహన రావుని మీ హృదయాన్ని అర్థంచేసుకో లేక పాపానికొడిగట్టాను మీ కింత క్షోభ కలిగించాను, ఇంటినుండి పారిపోయి ఇన్ని సంవత్సరాలు వెతికి, వెతికి చివ రకు నా చేతుల్లోనే చనిపోతున్నారా నాన్నా ? నేనెంత అసమర్థుడిని క్షమించ మని అడగటానికి గూడా అర్హుణ్ణిగాదు "

"ఆయన ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయిపోయారు ఎప్పుడో పారవేసుకున్న అమూల్య వస్తువు దొరికినట్లయింది ఆయ నకు సంతోషంతో బావురుమని ఏడ్చారు రెండు చేతులూ నా వైపు చాపారు వాత్సల్యంతో అయినా ఆయన చేతుల్లో చేరే యోగ్యత లేదు నాకు ఈ అనుకోని సమాగమానికి ఆయన ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు అప్పుడే ఆ జీవనజ్యోతి "కాస్తా పోయింది

* * *

"అంటే మీరనేది ?' అప్పటికి నా భార్య తేరుకొని అడిగింది అనుమానంగా

"అవును ఆయన కొడుకునే నేను కొడుకు దొరికాడన్న ఆనందంతో చని పోయారాయన నాకదే సంతోషం అయినా పాపానికి పరిహారం ఏమిటి ఆయన అడుగుజాడల్లో నడిచి నాది అన్న దంతా ప్రపంచానికి పంచి ఆత్మక్షాళన



చేసుకొంటాను. అదొక్కటే నేను చేయగలిగింది, ఆయనకు కానుకగా అర్పించ గలిగిందీను.''

అంతలో మా కూతురు బయటకొచ్చింది, "ఏం నాన్నా. నేను బడికి వెళ్ళొద్దా" అంటూ. దగ్గరకు తీసుకొని గుండెల కదుముకున్నాను. వాళ్ళమ్మ సమాధానం చెప్పింది నా బదులు. "వెళ్ళు రాణూ, వెళ్ళు. నీవు ఇంటిదగ్గరుంటే మీ తాతగారి ఆత్మకు శాంతి కలగదు. పద, పంపిస్తాను." ★